క్లుప్తంగా

పంగులూరు ఎంపీడీవో బదిలీ

జే.పంగులూరు: పంగులూరు ఎంపీడీవోగా ఇప్పటివరకు పనిచేసిన కే మాథ్యూబాబు బదిలీ అయ్యారు. ఆయనను జెడ్పీ సీఈఓ బదిలీపై గుంటూరు జిల్లాకు పంపారు. సుమారు 5 నెలల పాటు ఆయన ఎంపీడీవోగా పనిచేశారు. ఆయన గుంటూరు జిల్లాకు బదిలీపై శనివారం వెళ్లారు. ఎన్నికలకు ముందు పనిచేసిన ఎంపీడీవో రామాంజినేయులు ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. మళ్లీ బదిలీపై పంగులూరుకు వచ్చే అవకాశం ఉందని సమాచారం.

13న ఉపాధిహామీపై సామాజిక తనిఖీ

చీరాల టౌన్: ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో ఉపాధి నిధులతో చేపట్టిన పనులపై ఈనెల 13 తేదీన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఏపీవో దాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ప్రజా వేదికకు అన్నీ పంచాయతీల సెక్రటరీలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సమాచారంతో విధిగా హాజరుకావాలని ఏపీవో సూచించారు. సోషల్ ఆడిట్ బృందం తనిఖీల్లో వచ్చిన అంశాలపై వివరణ ఇస్తారని తెలిపారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ


బాలికలకు సైకిల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు: మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం దాతల సాయంతో సైకిళ్లు పంపిణీ చేశారు. యూఎస్ఏకు చెందిన ఈ కామ్, మార్టూరుకు చెందిన ఎఫెక్ట్ సంస్థల సౌజన్యంతో సుద్దమాల అర్చన కుమారి ఆర్థిక సహాయంతో 50 సైకిళ్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా బాలికలకు మరుగుదొడ్లు నిర్మించారు. ఈకార్యక్రమానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై సైకిళ్లు పంపిణీ చేశారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు


స్వర్ణోత్సవాల్లో జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్టూరు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు శనివారం మార్టూరు ప్రాంతీయ మండలాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు బండారు ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కందిమళ్ల రవిబాబు జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా 50 ఏళ్ల యూటీఎఫ్ ప్రస్థానంలో నిర్వహించిన ఉద్యమాలు సాధించిన ప్రగతి గురించి మరో జిల్లా కార్యదర్శి పాలపర్తి రామాంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి పూపూరు సునీల్ కుమార్ కోశాధికారి అట్లూరు ప్రశాంత్ ప్రసంగించారు. కార్యక్రమంలో మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి సంతమాగులూరు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

చినగంజాం (పర్చూరు): కేరళ వరద బాధితుల కోసం పర్చూరులో సీఐటీయూ నాయకులు విరాళాలను సేకరించారు. ఇటీవల కేరళలోని వయనాడు ప్రాంతంలో వరదలు వచ్చి కొండచరియలు విరిగి పడటంతో గ్రామంలో 400 పైచిలుకు ప్రజలు మృత్యువాత పడ్డారు. ఈ దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని దుఃఖంలో ముంచేసిందన్నారు. బాధితులను ఆదుకోవటానికి శనివారం ప్రజా సంఘాల నాయకులు ముందుకు వచ్చారు. పర్చూరులో అన్ని దుకాణ యజమానుల వద్ద విరాళాలను సేకరించి బాధితులకు పంపనున్నట్లు వారు తెలిపారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు అవసరం

చీరాల టౌన్: దోమలు కుట్టకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అప్రమత్తంగా ఉండటం వలనే వ్యాధులబారిన పడరని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు శ్రీదేవి సూచించారు. మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో శనివారం దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ జనావాసాల మధ్య మురుగునీటి కుంటలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు ఉండటం వలన దోమలు వ్యాప్తి చెందుతాయని దోమలకు ఆవాసాలను నిర్మూలించాలన్నారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వలేని ఆహార పదార్థాలను తినాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న పాత హాస్టల్ భవనాలు


స్లాబు పగిలి బయటపడిన ఇనుప చువ్వలు


మద్యం సీసాలు చేతపట్టుకొని పారిపోతున్న మందుబాబులు

అరాచకాల అడ్డా ..!

- శిథిలావస్థలో పాత హాస్టల్ భవనాలు
- మద్యం, పేకాట, అసాంఘిక పనులకు నెలవుగా మారిన వైనం
- భవనాలు తొలగించాలని అధికారులకు విన్నపాలు
- కన్నెత్తి చూడని అధికారులు

చీరాల రూరల్: ప్రస్తుతం చీరాల పట్టణం, దాని పరిసర ప్రాంతాల పరిస్థితులు అసలు బాగోలేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఏ దారుణ ఘటన జరిగినా అది చీరాలలోనే కనిపిస్తోంది. చీరాలలో కాదు రాష్ట్రంలోనే శాంతి, భద్రతలు కరువయ్యాని ప్రజలు, మేధావులు వివిధ వర్గాల నాయకులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. చీకటి పడితే చాలు ఏం జరుగుతుందో ఏమో అని ప్రజలు భయాందోళనకు గురవతున్నారు. దీనికి కారణం మద్యం, గంజాయి తదితర మత్తుపదార్థాలు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి కూతవేటు దూరంలో లాల్ బహుదూర్‌శాస్త్రి నగర్ (ఎల్‌బీఎస్)లో ఉన్న పాత ఎస్సీ, బీసీ హాస్టల్ భవనాలు మందుబాబులు, పేకాట, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అసలే పాత భవనాలు కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నానిపోయి ఛిద్రమయ్యాయి. ఎప్పుడు కూలుతాయేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దానికి తోడు ఆ భవనాలలో రాత్రులు, పగలు అనేతేడా లేకుండా మద్యం తాగుతూ, పేకాటలాడుతూ, మరుగుదొడ్లకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో స్థానికులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

వివరాల్లోకి వెళితే...

స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు సమీపంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో అనేక ఏళ్ల క్రితం సువిశాల ప్రదేశంలో రెండస్తుల్లో బీసీ, ఎస్సీ వసతి గృహాలను నిర్మించారు. ఆ వసతి గృహాలు ఎంతోమంది విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పించి బంగారు భవిష్యత్‌ను అందించాయి. అయితే ఆ వసతి గృహాలు నిర్మించి అనేక ఏళ్లు గడుస్తుండడంతో అప్పట్లోనే స్లాబులకు పగుళ్లిచ్చాయి. వర్షాలకు వర్షపునీరు విద్యార్థుల రూముల్లోకి చేరేయి. పూర్తిగా అయి అవసానదశకు చేరుకున్నాయి. నివాస యోగ్యానికి ఏ మాత్రం అనువుగా లేవనే కారణంతో అధికారులు పదేళ్ల క్రితమే ఆయా వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను వేటపాలేనికి తరలించారు.

కూల్చేయాలనే ఆదేశాలు ఉన్నాయి.. !

శిథిలమై అవసానదశకు చేరుకున్న ఆయా భవనాలను కూల్చేయాలని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు విన్నపాలు కూడా పంపించారు. ఆయా విన్నపాలను అందుకున్న ఉన్నతాధికారులు ఆ భవనాలను పూర్తిగా కూల్చేసేందుకు ఆదేశాలు జారీచేశారు. కొంత నగదును కూడా అధికారులకు అందజేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు జారీచేసిన ఆదేశాలు ఇప్పటికి అలానే ఉన్నాయి. కానీ నేటికి ఆ భవనాల జోలికి మాత్రం అధికారులు వెళ్లనేలేదు.

గేట్లు, తలుపులు, కిటికీలు మాయం..

ఎంతో సువిశాలంగా నిర్మించిన ఆ భవనాలకు మొదట్లో అనేక తలుపులు, కిటికీలు ఎంతో విశాలంగా అమర్చి ఉండేవి. వసతి గృహం లోపలికి ప్రవేశించే ముందు ప్రహరీకు పెద్ద ఇనుప గేటు కూడా ఉండేది. భవనాలపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో వాటన్నింటిని కొందరు దొంగలు ఎంచక్కా ఊడతీసుకుని వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయా భవనాలకు తలుపులు, కిటికీలు, గేట్లు లేక పోవడంతో బోసిపోయిఉన్నాయి. పైఅంతస్తులో స్లాబులు పగిపోయి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. పైఅంతస్తులోని కొన్ని రూములు శిథిలమయ్యాయి. మరికొన్ని రూముల్లో చెట్లు పెరిగిపోయాయి.

అరాచకాలకు అడ్డాలుగా ..

ఆయా భవనాలకు గేట్లు, తలుపులు, కిటికీలు లేక పోవడంతో పాటు అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడడంతో ఆయా భవనాలను ప్రస్తుతం కొందరు అరాచకవాదులు తమ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా వాడుకొంటున్నారు. రాత్రనకా, పగలనకా ఆయా భవనాలలో చేరి నిత్యం మద్యం సేవిస్తున్నారు. మరికొందరైతే పేకాట క్లబ్‌గా మార్చుకున్నారు. మరికొందరు జులాయిగా తిరిగే యువకులు కూడా ఆ భవనాల్లోకి వెళ్లి ముచ్చట్లు పెట్టుకుంటూ సెల్‌ఫోన్లు చూసుకుంటూ కాలం గడుపుతున్నారు. సందట్లో సడేమియాగా కొందరు స్థానికులు భవనాలను బహిర్భూమికి ఉపయోగించుకొంటున్నారు.

> **మాపైనే దాడులకు దిగుతున్నారు..**
>
> 
>
> భవనాలలో పేకాట, మద్యం సేవించే ందుకు వచ్చేవారికి అనేకసార్లు ఇక్కడి రావద్దని చెప్పాం. కానీ మా మాటలు వినకుండా మీరు మాకు చెప్పేదేంటి.. ఇది మీ ఇల్లు కాదు ప్రభుత్వ భవనాలు మా ఇష్టం అంటూ మాపైనే దాడులు చేసేందుకు వస్తున్నారు. ఈ విషయాలను అనేకసార్లు పోలీసులు, సంబంధిత అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లా. అరాచకవాదుల దృష్టిలో మేము చెడ్డవాళ్లం అవడం తప్ప ఎటువంటి ప్రయోజం ఉండడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను కూల్చేయాలి.
>
> – సూర్యనారాయణ, స్థానికుడు

అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా రాస్తారోకో


రహదారిపై రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు

చినగంజాం (పర్చూరు): అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా పర్చూరులో దళిత సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శనివారం పర్చూరు బొమ్మల సెంటర్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జైభీం అంటూ నినాదాలు చేశారు. దళితుల జోలికి వస్తే ఊరుకునేది లేదని దళిత నాయకులు హెచ్చరించారు. తమ ఆరాధ్యదైవం అంబేడ్కర్ విగ్రహంపై దాడికి ప్రయత్నించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. నాగులపాలెం దళితవాడలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు కూరాకుల ఇస్సాక్, గేరా స్వరాజ్ కుమార్, జూపూడి రోశయ్య, ఎడ్ల జయరాజు, కొట్టే ప్రభుదాసు, కూరకుల చెంచు, కాకి అశోక్, బిళ్లా రాజేష్, విజయ్, మద్దిరాల సంతారావు, యెహోషువా, ఎన్ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవుల ఆహారం కోసం విరాళం అందజేత


దాతలను సత్కరిస్తున్న వాకింగ్ సభ్యులు

చీరాల రూరల్: గోవుల ఆహారం కోసం దాతలు విరాళం అందజేశారు. శనివారం ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రౌండ్‌లో కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా గవర్నమెంట్ హాస్పిటల్‌కు వచ్చే రోగులకు, సహాయకులకు అన్నదాన నిమిత్తం పూర మస్తానరావు, శివరాజకుమారి చారిటబుల్ ట్రస్టుకు, శ్రీకృష్ణ గోశాలకి గోవుల ఆహార నిమిత్తం దేవకి సుబ్బారావుకు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరి చారగుళ్ల గురుప్రసాద్, సుధాకరరావు, టీ బాలగంగాధరరావు, దోగుపర్తి వెంకటసురేష్, గుర్రం బదరీనాథ్, వలివేటి మురళీకృష్ణ,వీ రాంజనేయులు, శీరాం రమేష్, శ్రీనివాసరావు, నారాయణరావు, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రోడ్లు జలమయం


ఈపురుపాలెంలో చెరువుగా మారిన ప్రధాన రోడ్డు

చీరాల: మధ్యాహ్నం వరకు ఎండ ఆ తర్వాత ఒక్కసారిగా కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులు అన్నీ తటాకాలను తలపించాయి. శనివారం సాయింత్రం ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గంటపాటు కురిసిన వర్షానికి పలు రోడ్ల మీద వర్షం నీరు నిలిచింది. అలానే పట్టణంలోని ప్రధాన రహదారుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా చీరాల-బాపట్ల రోడ్డులోని శాంతినగర్, ఈపూరుపాలెం ప్రధాన రహదారి, చీరాల-ఒంగోలులోని దేవాంగపురి, ప్రధాన రహదారులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి వర్షపునీరు నిలవకుండా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనిత హాస్పిటల్లో ఆధునిక వైద్య సేవలు



నూతనంగా ప్రారంభించిన అనిత హాస్పిటల్

చీరాల టౌన్: అభివృద్ధి చెందుతున్న చీరాల నియోజకవర్గంలోని ప్రజలకు అన్నీరకాల అధునిక వైద్య పరికరాలతో అనిత హాస్పిటల్‌లో వైద్య సేవలు అందించేందుకు తామంతా సిద్ధమేనని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె. అనిత, డాక్టర్ కె.బాలాజీ, డాక్టర్ కె.అనూజ తెలిపారు. శనివారం పట్టణంలోని బోస్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అనిత హాస్పిటల్‌ను డాక్టర్ అనిత తల్లి ప్రమీలాదేవి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హాస్పిటల్ వైద్యులు మాట్లాడుతూ ఎండోస్కోపి, కొలనోస్కోపీ, ల్యాప్రోస్కోపి శస్త్ర చికిత్సలు, జీర్ణకోశ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో చీరాల్లోని ప్రముఖ వైద్యులు డాక్టర్ గోరంట్ల రాజేష్, డాక్టర్ నారాయణరెడ్డి, తదితర వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

బల్లికురవ: మండలంలోని కొత్తపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయ మూడో వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అమ్మవారిని, ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలతో ప్రత్యేకంగా అలంకరించారు. వర్షాలు కురిసి, గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని నాభిశిల గమిడి రాళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడిని 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టడంతో ఓవ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల జాతీయరహదారిపై శనివారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపునకు మోటారు బైకుపై ఒక మగ, ఒక ఆడమనిషి వెళ్తున్నారు. బైకు మేదరమెట్ల దక్షిణ బైపాస్ దాటి హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన వాహనం బైకును ఢీకొంది. దీంతో బైకుపై ఉన్న ఇరువురు రోడ్డుపై పడిపోగా బైకు నడుపుతున్న వ్యక్తికి గాయాలు కాగా 108 వాహనంలో స్థానిక వైద్యశాలకు తరలించారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ


ఎస్సై వెంకటేశ్వర్లు


ఎస్సై జీవీ చౌదరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

బల్లికురవ: బల్లికురవ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా జీవీ చౌదరి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వీ రవిశంకర్‌రెడ్డి బదిలీపై బాపట్ల వెళ్లారు. యద్దనపూడి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న చౌదరి బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతలు నెలకొల్పడం కోసం పోలీసు శాఖకు ప్రజలు సమకరించాలని కోరారు. అనంతరం ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అద్దంకి ఎస్సైగా ప్రవీణ..

అద్దంకి: అద్దంకి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా జిల్లా వీఆర్‌లో ఉన్న పీహెచ్ ప్రవీణను బదిలీ చేస్తూ ఎస్పీ తుషార్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఎస్సై యద్దనపూడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

కారంచేడు ఎస్సైగా వెంకట్రావు..

కారంచేడు: కారంచేడు ఎస్సైగా వీ వెంకట్రావును నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు. శనివారం జిల్లాలో 18 మంది ఎస్సైలకు స్థాన చలనం కలిగించారు. ఈ బదిలీల్లో భాగంగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న కే సురేష్‌కు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయనను బాపట్ల వీఆర్‌కు పంపించారు.

రేణింగవరం ఎస్సైగా వినోద్‌బాబు

జే.పంగులూరు: రేణింగవరం ఎస్సైగా బాలిన వినోద్ బాబును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీఆర్ నుంచి వినోద్ బాబు ఇక్కడకు వస్తున్నారు. రేణింగవరం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటివరకు ఎస్సైగా పనిచేసిన కేకే తిరుపతిరావు బదిలీపై నిజాంపట్నం వెళ్తున్నారు.

వేటపాలెం: మండల నూతన ఎస్సైగా ఎం వెంకటేశ్వర్లు శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన చీరాల ఒన్ టౌన్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న జీ సురేష్ బదిలీపై ఇంకొల్లు వెళ్లారు.

మదర్ సర్వీస్ సొసైటీకి సేవా పురస్కారం


సేవా పురస్కారం అందుకుంటున్న నాగిరెడ్డి

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మున్నంగి నాగిరెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. మదర్ సర్వీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఈ ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. సంస్థ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా శనివారం నంద్యాల పట్టణంలో రామకృష్ణ డిగ్రీ కళాశాలలో వివేకానంద ఆడిటోరియంలో ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ చైర్మన్ మునగాల స్వాతి చేతలమీదగా ఆయన అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ కేవీవీ సుబ్బయ్య, మేనేజర్ ప్రగతి, డాక్టర్ శశికళ, ట్రస్ట్ చైర్మన్ వెంకటరెడ్డి, ప్రతినిధులు సురేష్‌కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధి బ్రహ్మం, తెలుగు రాష్ట్రాల అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లతో స్వయం ఉపాధి


కుట్టు మిషన్ అందజేస్తున్న రోటరీ సభ్యులు, దాత

అద్దంకి: కుట్టుమిషన్‌తో మహిళలకు స్వయం ఉపాధి కలుగుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో శనివారం రోటరీ పూర్వ అధ్యక్షుడు హాజీ సయ్యద్ మౌలాలి పుట్టినరోజు సందర్భంగా, స్థానిక రోటరీ కార్యాలయంలో, మౌలాలి సౌజన్యంతో పేద మహిళ దాసరి ఉమా గారికి కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, సహాయ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీకృష్ణ, డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రేపటి నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

మార్టూరు: మండలంలోని పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు రేపటి నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జి నితిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో ఆఫీసులో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి అందరూ హాజరవ్వాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మేదరమెట్ల: రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరి వ్యక్తులను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఈఘటన శనివారం రాత్రి మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవే కేఫ్‌కు దగ్గరలో జరిగింది. అందిన వివరాల మేరకు.. జార్ఖండ్‌కు చెందిన రవీందర్, రాకేష్‌లు స్థానిక భ్రమరాంబ వెంచర్‌లో పనిచేస్తున్నారు. ఈక్రమంలో ఒక పనినిమిత్తం రాత్రి నడుచుకుంటూ వెళ్తుండగా ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. కాగా క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శ్రావణ మాసం, స్వాతి నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచహారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.